APTEL/26/A4269

అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ సోమవారం 16 నవంబర్ 2026 సంపుటి: 01 సంచిక :169 పేజీలు : 04 వెల: 2-00/-

గుడివాడలో వైసీపీకి షాక్.. టీడీపీలోకి 250 మంది



అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత వైసీపీకి వరుసగా షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఇటీవల నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఆ పార్టీకి గట్టి షాక్‌లు కొడుతున్నాయి. తాజాగా కృష్ణాజిల్లా గుడివాడలో వైసీపీకి గట్టి షాక్ కొట్టంది.

మచిలీపట్నం, నవంబర్15: అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత వైసీపీకి వరుసగా షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఇటీవల నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఆ పార్టీకి గట్టి షాక్‌లు కొడుతున్నాయి. మిగతా..2లో

రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు



కాంగ్రెస్ బీజేపీ నేతల తీరుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

రాహుల్ బైక్ వెనుక మంత్రులు పరిగెత్తడంపై ఆగ్రహం


తెలంగాణ పునాది ఆత్మగౌరవమన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ ప్రొటోకాల్‌పై బీఆర్ఎస్ ప్రశ్నలు

ఫిట్‌గా ఉన్నందునే పరిగెత్తానన్న పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం అనే ప్రాతిపదికన ఏర్పాటయిందని, అయితే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఈ విషయాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మిగతా..2లో


బంగాళాఖాతంలో తీవ్రరూపం దాల్చిన వాయుగుండం.. ఏపీకి 'అక్వాన్' గండం



- బంగాళాఖాతంలో వాయుగుండం
- రేపటికి తుపానుగా, ఎల్లుండికి తీవ్ర తుపానుగా మారే అవకాశం
- రాగల రెండు రోజుల్లో ఏపీ తీరం వైపు కదిలే ఛాన్స్
- నవంబర్ 19, 20 తేదీల్లో కోస్తాంధ్రలో అత్యంత భారీ వర్షాలు
- తీరం వెంబడి గంటకు 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు

ఎల్‌నినోతో పాటు ఒకేసారి రెండు తుపాన్లతో ఏపీకి భారీ నష్టం

- ఓ వైపు ఎల్‌నినో.. మరోవైపు ఒకే సారి రెండు తుపాన్లు రావడం..
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీ నష్టం కలిగిందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- తుపాను గమనాన్ని ముందే అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు.



అమరావతి, నవంబర్15: ఓ వైపు ఎల్‌నినో.. మరోవైపు ఒకే సారి రెండు తుపాన్లు రావడం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీ నష్టం కలిగిందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తుపాను గమనాన్ని ముందే అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. ఆదివారం రాజధాని అమరావతిలో మురసు తుపాను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందంతో ఆయన వర్చువల్ సమావేశమయ్యారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం తుపాను నష్టంపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుపాను తదనంతరం మిగతా..2లో

రాప్తాడు విద్యార్థినికి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతం



- బాలికను త్వరలో ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు తరలించనున్న వైద్యులు
- ఆమె ఆరోగ్యంపై వివరాలు వెల్లడించిన మంత్రి లోకేశ్
- బాధితురాలి వైద్య ఖర్చులను పూర్తిగా భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి : రాప్తాడు విద్యార్థినికి నిర్వహించిన మరో ప్లాస్టిక్ సర్జరీ విజయవంతమైందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన 'ఎక్స్' వేదికగా ఈ వివరాలను వెల్లడించారు. బాలికకు కుట్లు తీసివేసి, గాయాన్ని శుభ్రపరిచి తిరిగి కుట్లు వేసే ప్రక్రియ (డీబ్రిడ్‌మెంట్, రీ-స్యూచరింగ్) పూర్తయిందని పేర్కొన్నారు. ఆమెను త్వరలోనే ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు తరలించనున్నట్లు వివరించారు. కొన్ని రోజులుగా ఆమె వెంటిలేటర్

కొండగట్టులో భారీ కుంభకోణం.. రూ.23 కోట్ల నిధులు గోల్‌మాల్?

- ఏళ్ల తరబడి ముందుకు సాగని దేవాదాయ శాఖ విచారణ
- ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు
- ఆడిట్ నివేదికలో వెలుగులోకి వచ్చిన భారీ అవకతవకలు
- ప్రసాదాలు, హుండీ, సేవల టికెట్లలో నిధుల మాయం



హైదరాబాద్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో కోట్ల రూపాయల నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు రూ.23 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు ఆడిట్ నివేదికలో తేలగా, ఈ వ్యవహారంపై ఏళ్ల తరబడి విచారణ ముందుకు సాగకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. 2013-14 నుంచి 2017-18 మధ్య కాలంలో జరిగిన ఆడిట్‌లో ఈ భారీ వ్యత్యాసాలు బయటపడ్డాయి. తొలుత రూ.2.26 కోట్లుగా ఉన్న అభ్యంతరాలు, తదుపరి ఆడిట్‌లలో రూ.23 కోట్లకు చేరినట్లు తెలిసింది. హుండీ ద్వారా వచ్చిన డబ్బులు, ఆర్జిత సేవల టికెట్ల ద్వారా వచ్చిన ఆదాయం పూర్తిగా ఖజానాకు జమ కాలేదని, ప్రసాదాల తయారీకి కొనుగోలు చేసిన సరుకుల లెక్కల్లోనూ భారీ తేడాలు ఉన్నాయని ఆడిట్ విభాగం స్పష్టం చేసింది. మిగతా..2లో

స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు.. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ట్రాఫిక్ సూచనలు ఇవే!



- స్టీల్ ఫ్లైఓవర్ పనుల వల్ల బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లో తీవ్ర ట్రాఫిక్ రద్దీ
- శ్రీనగర్ టీ జంక్షన్ నుంచి ఎన్టీఆర్ భవన్ మార్గంలో వాహనాలపై అధిక ప్రభావం
- ఉదయం సాయంత్రం పీక్ అవర్స్‌లో రోడ్ నంబర్ 2 వైపు రావొద్దని పోలీసుల విజ్ఞప్తి
- బేగంపేట శ్రీనగర్ కాలనీ నుంచి వచ్చే వాహనదారులకు ట్రాఫిక్ డైవర్షన్లు
- డెక్కన్ క్రానికల్ కథనం ప్రకారం పలు ప్రధాన రూట్లలో ట్రాఫిక్ మళ్లింపులు

సాంకేతిక ఆవిష్కరణల్లో భారత్ గ్లోబల్ లీడర్ గా ఎదగాలి

అధునాతన సాంకేతికతను వినియోగించుకునే దేశంగా కాకుండా కీలక రంగాల్లో నూతన ఆవిష్కరణలు చేస్తూ ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి భారత్ ఎదగాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్షించారు.



ఢిల్లి : అధునాతన సాంకేతికతను వినియోగించుకునే దేశంగా కాకుండా కీలక రంగాల్లో నూతన ఆవిష్కరణలు చేస్తూ ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి భారత్ ఎదగాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం పిలుపునిచ్చారు. దేశ భద్రతా సన్నద్ధత, ఆత్మనిర్భరత (స్వయం సమృద్ధి) కోసం దేశంలోని 'నాన్-డిస్ట్రక్టివ్ టెస్టింగ్' వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరముందని ఆయన నొక్కి చెప్పారు. నాన్-డిస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్, ఎనేబ్లింగ్ టెక్నాలజీస్‌పై జరిగిన 36వ వార్షిక సదస్సు, ఏరోస్పేస్‌లో నాన్-డిస్ట్రక్టివ్ టెస్టింగ్‌పై జరిగిన 15వ అంతర్జాతీయ సింపోజియంను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. "ఆధునిక తనిఖీ సాంకేతికతలలో దేశీయ సామర్థ్యాలను పెంపొందించడం ఎంతో అవసరం. ముఖ్యంగా నాణ్యత ప్రమాణాలను ప్రోత్సహించడం, వ్యూహాత్మక రంగాల్లో పరీక్ష ఫలితాల కచ్చితత్వం, విశ్వసనీయత, సమగ్రతను కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇందుకోసం ప్రత్యేక సెన్సార్లు, మూల్యాంకన పరికరాలు, సంబంధిత సాఫ్ట్‌వేర్‌లలో మిగతా..2లో

దూసుకొస్తున్న ఆక్వాన్ తుపాను.. తెలంగాణలో పలు జిల్లాలకు హెచ్చరిక



- నవంబర్ 20న తుపాను ఉత్తర కోస్తాంధ్ర తీరాన్ని దాటే అవకాశం
- నవంబర్ 20 నుంచి 22 వరకు తెలంగాణలోని తూర్పు, దక్షిణ జిల్లాలో విస్తారంగా వానలు
- 21, 22 తేదీల్లో ఇతర జిల్లాలో కూడా కురవనున్న వర్షాలు

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పుల కారణంగా తెలుగు రాష్ట్రాలకు తుపాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం క్రమంగా వాయుగుండంగా

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై ప్రధాని మోదీకి వినతి.. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

తెలంగాణలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కేంద్ర సహకారం కోరుతూ ప్రధాని మోదీని ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి బృందం కలిసింది. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆ వివరాలను వెల్లడించారు.



ఢిల్లీ, నవంబర్ 15: తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న వివిధ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కేంద్ర సహకారం కోరడంతో పాటు పలు కీలక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీతో చర్చించినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి బృందం.. రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, తాగునీటి పరిస్థితులు, రైతుల ప్రయోజనాలకు సంబంధించి పలు అంశాలను వివరించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్: తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తు పెంచేందుకు అనుమతి ఇవ్వాలని, దీనికోసం మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని ప్రధాని మోదీని కోరినట్లు మంత్రి తెలిపారు. ప్రాజెక్టు ఎత్తు పెంచాల్సిన అవసరాన్ని ప్రధానికి పూసగుచ్చినట్లు వివరించామని పేర్కొన్నారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్ట్: ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిరభ్యంతర పత్రం (మీజ) అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. చనాక కొరాట బ్యారేజీ: ఈ ప్రాజెక్టు కోసం రూ. 103 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే చాలా ప్రాజెక్టులు 70 శాతం మేర పూర్తయ్యాయని, వాటిని త్వరగా పూర్తి చేసేందుకు కేంద్రం ఆర్థికంగా సహకరించాలని కోరినట్లు వెల్లడించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి ఎల్లుండి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని కలవనున్నట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. కేంద్రం ఇచ్చిన వివిధ హామీలపై కూడా ప్రధానితో చర్చలు జరిపినట్లు ఆయన పేర్కొన్నారు. మిగతా..2లో

కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేసే అవకాశం లేదు



- కాళేశ్వరం ప్రాజెక్టులో గేట్లు మూసి నీటిని నిల్వ చేసే అవకాశం లేదని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.
- సమ్మక్క సాగర్ బ్యారేజ్ వద్ద మాత్రమే నీటి నిల్వకు అవకాశం ఉందని తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబరు 15 : కాళేశ్వరం ప్రాజెక్టులో గేట్లు మూసి నీటిని నిల్వ చేసే అవకాశం లేదని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సమ్మక్క సాగర్ బ్యారేజ్ వద్ద మాత్రమే నీటి నిల్వకు అవకాశం ఉందని తెలిపారు. (ఆదివారం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి నీటి నిల్వ పనులను మంత్రి పరిశీలించారు. అలాగే, దమ్మపేట మండలం పూసుకుంట గ్రామంలో పర్యటించారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

రాప్తాడు విద్యార్థినికి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతం

సాయం లేకుండానే శ్వాస తీసుకుంటోందని, ప్రస్తుతం ద్రవ ఆహారం కూడా ఇస్తున్నారని మంత్రి లోకేశ్ తెలిపారు. తాజాగా శనివారం నిర్వహించిన సర్జరీతో ఆమె కోలుకోవడంలో మరో ముందడుగు పడినట్లయింది. బాధితురాలి వైద్య ఖర్చులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై ప్రధాని మోదీకి వినతి.. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

గతంలో మేడిగడ్డ బ్యారేజీ కూలడంతో గోదావరి నీళ్లు దిగువకు వెళ్ళిపోయాయని, ప్రస్తుతం దేవాదుల, సీతారామ ప్రాజెక్ట వద్ద నీటిని లిఫ్ట్ చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఈ పరిణామాల నేపథ్యంలో యాసంగి సీజన్‌లో రైతులు వరి పంట వేయొద్దని విజ్ఞప్తి చేశారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో ప్రస్తుత 'ఎల్‌నినో' పరిస్థితుల కారణంగా తలెత్తిన వాతావరణ మార్పులను ప్రధానికి వివరించామని తెలిపారు. రాష్ట్రంలో భూగర్భ జలాలకు పునరుజ్జీవనం కల్పించేందుకు రూ. 5,000 కోట్ల ప్రత్యేక కేంద్ర సాయాన్ని కోరినట్లు చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ఎలాంటి నీటి కొరత లేదని, భవిష్యత్తులో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు

దూసుకొస్తున్న ఆక్వాన్ తుపాను..

తెలంగాణలో పలు జిల్లాలకు హెచ్చరిక

మారి, తుపానుగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ తుపానుకు 'అక్వాన్' అని నామకరణం చేశారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ తుపాను ఉత్తర-వాయువ్య దిశగా ప్రయాణించి నవంబర్ 20 నాటికి ఉత్తర కోస్తాంధ్ర తీరాన్ని దాటే అవకాశాలు ఉన్నాయి. దీని ప్రభావంతో నవంబర్ 20 నుంచి 22 వరకు తెలంగాణలోని తూర్పు, దక్షిణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 21, 22 తేదీల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా తుపాను ప్రభావం కనిపిస్తుందని అధికారులు తెలిపారు.

గుడివాడలో వైసీపీకి షాక్.. టీడీపీలోకి 250 మంది

తాజాగా కృష్ణాజిల్లా గుడివాడలో వైసీపీకి గట్టి షాక్ కొట్టంది. కృష్ణాజిల్లా వైసీపీ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖాసిం అలియాస్ అబూ ఆదివారం టీడీపీలో చేరారు. ఆయనతోపాటు దాదాపు 250 మంది అనుచరులు వైసీపీకి రాజీనామా చేసి.. టీడీపీలో చేరారు. కుండువా కప్పి వారందరిని పార్టీలోకి స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతోపాటు మాజీ మంత్రి పిన్నమనేని వేంకటేశ్వరరావు ఆహ్వానించారు. గుడివాడ అభివృద్ధి చూసే తాము టీడీపీలోకి వచ్చామని ఈ సందర్భంగా అబూ ప్రకటించారు. మైనార్టీ షాదీఖానాకు రూ. 2 కోట్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే రాముకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గుడివాడ అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలనుకునే వారిని పార్టీలోకి ఆహ్వానిస్తామని ఎమ్మెల్యే రాము చెప్పారు.

కొండగట్టులో భారీ కుంభకోణం..

రూ.23 కోట్ల నిధులు గోల్‌మాల్?

ఈ నిధుల దుర్వినియోగానికి ఆలయ ఉద్యోగులే బాధ్యులని తేల్చి చెప్పింది. ఈ అక్రమాలపై విచారణ జరపాలని 2022లోనే అప్పటి ఆలయ ఈవో ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దీంతో వేములవాడ ఆలయ ఈవోను విచారణాధికారిగా నియమిస్తూ అదే ఏడాది ఆగస్టులో ఆదేశాలు జారీ అయ్యాయి. 2025లో మరోసారి ఆదేశాలు ఇచ్చినా, విచారణ మాత్రం అంగుళం కూడా ముందుకు కదలలేదు. ఇటీవల విధుల్లో చేరిన ఓ కొత్త ఉద్యోగి ఈ ఫైల్‌ను గుర్తించి మళ్లీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. విచారణ నత్తనడకన సాగుతుండగానే, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగుల్లో కొందరు పదోన్నతులు పొంది ఇతర ఆలయాలకు బదిలీ కావడం గమనార్హం. మరికొందరు ఎలాంటి చర్యలు లేకుండానే ఉద్యోగ విరమణ పొందారు. దేవాదాయ శాఖలోని కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే విచారణను ఆలస్యం చేస్తూ అవినీతిపరులను కాపాడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, గత ఆగస్టులో ఇదే ఆలయంలో రూ. 49.29 లక్షల నిధుల దుర్వినియోగానికి సంబంధించి నలుగురు ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఒకరిని ఉద్యోగం నుంచి తొలగించి, ముగ్గురి ఇంక్రిమెంట్లను నిలిపివేశారు. ప్రస్తుతం ఆలయంలో 60 ఏళ్ల తర్వాత చారిత్రాత్మక చందనోత్సవం నవంబర్ 16 నుంచి జరగనున్న తరుణంలో ఈ భారీ కుంభకోణం మళ్లీ తెరపైకి రావడం చర్చనీయాంశంగా మారింది.

స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు..

హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ట్రాఫిక్ సూచనలు ఇవే!

హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 పరిసరాల్లో ప్రయాణించే వాహనదారులను ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తం చేశారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ మధ్య స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశముందని హెచ్చరించారు. ఈ నిర్మాణ పనులు ఎంతకాలం సాగుతాయి, ట్రాఫిక్ మళ్లింపులు ఎప్పటివరకు అమల్లో ఉంటాయనే దానిపై ఇంకా అధికారికంగా తుది గడువును వెల్లడించలేదు. ఈ నిర్మాణ పనుల కారణంగా ముఖ్యంగా రోడ్ నంబర్ 2లోని శ్రీనగర్ టీ-జంక్షన్ (ఫ్లై) నుంచి ఎన్టీఆర్ భవన్ మధ్య మార్గంలో రాకపోకలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ క్రమంలో వాహనదారులు సాధ్యమైనంత వరకు రోడ్ నంబర్ 2 వైపు రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని, ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్ సూచించారు. ముఖ్యంగా ఉదయం 8:30 నుంచి 11:00 గంటల వరకు, అలాగే సాయంత్రం 5:00 నుంచి రాత్రి 9:00 గంటల మధ్య పీక్ అవర్స్ రద్దీ తీవ్రంగా ఉంటుందని, ఈ సమయాల్లో ఆయా మార్గాలను నివారించడం ఉత్తమమని స్పష్టం చేశారు.

ఈ రద్దీని క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు కీలక దారి మళ్లింపులను ప్రకటించారు:

రోడ్ నంబర్ 2 వైపునకు కుడి మలుపును పూర్తిగా మూసివేశారు. వాహనదారులు శ్రీనగర్ టీ-జంక్షన్ వద్ద ఎడమవైపు తిరిగి, ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు వెళ్లి అక్కడ యూ-టర్న్ తీసుకోవాల్సి ఉంటుంది. బేగంపేట నుంచి ఎస్ఎన్టీ, సాగర్ సొసైటీ, కేటీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, రోడ్ నంబర్ 36, 45 లేదా కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లే వారు: పంజగుట్ట ఫ్లైఓవర్ వై-జంక్షన్ వద్ద ఎడమవైపు తిరిగి తాజ్ కృష్ణా, రోడ్ నంబర్ 1 మీదుగా వెళ్లాలి. అనంతరం 1/10 బంజారాహిల్స్ జంక్షన్ వద్ద కుడి మలుపు తీసుకుని జహీరానగర్, బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, అగ్రసేన్ ఐలాండ్ మీదుగా రోడ్ నంబర్ 45, 36, కేబుల్ బ్రిడ్జి, సైబరాబాద్, మాదాపూర్ ప్రాంతాలకు చేరుకోవచ్చు. శ్రీనగర్ కాలనీ నుంచి ఎన్టీఆర్ భవన్ లేదా కేబుల్ బ్రిడ్జి వైపు ప్రయాణించే వారు: ఇందిరానగర్ గడ్డ మీదుగా వెంకటగిరి చేరుకుని, అక్కడి నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10, 36 ద్వారా మాదాపూర్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. ఎన్ఎఫ్‌సీఎల్ నుంచి ఎన్టీఆర్ భవన్, రోడ్ నంబర్ 45, 36 లేదా మాదాపూర్ వెళ్లే వారు: సాగర్ సొసైటీ టీ-జంక్షన్ వద్ద కుడివైపునకు మళ్లాలి. అక్కడి నుంచి శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు మీదుగా ఇందిరానగర్ గడ్డ, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 5, వెంకటగిరి జంక్షన్ చేరుకుని రోడ్ నంబర్ 10, 36 మీదుగా మాదాపూర్ వైపు సాగిపోవాలని అధికారులు వివరించారు. నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు వాహనదారులు పోలీసులకు సహకరించి, సూచించిన ప్రత్యామ్నాయ మార్గాల్లోనే ప్రయాణించాలని అధికారులు కోరారు.

మావోయిస్టుల హింసాకాండతో ఆదివాసీలు నష్టపోయారు : ప్రధాని మోదీ

దేశం సాధించిన విజయాల్లో నక్సలిజం- మావోయిజం నుంచి విముక్తి పొందడం కూడా ఒకటని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

మావోయిస్టుల హింసాకాండ వల్ల ఆదివాసీలు నష్టపోయారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గత ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వారిని గాలికొదిలేశాయని ఆరోపించారు. నక్సలైట్లు గిరిజనుల ఓటు హక్కును సైతం కాలరాసినా నాటి పాలకులు చోద్యం చూస్తూ ఉండిపోయారని విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా మహారాష్ట్ర గడ్చిరోలిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు. 3వేల కోట్ల రూపాయల విలువైన 246 అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. దశాబ్దాలుగా కనీస వసతులకు నోచుకోని గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మోదీ తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రగతి కోసం లక్ష కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. గిరిజన వర్గాలు ఎల్లప్పుడూ అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడ్డాయని ప్రశంసించారు. దేశంలో 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడం, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత్ సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటని అన్నారు. "మావోల హింస వల్ల గిరిజన సమాజం ఎక్కువగా నష్టం పోయింది. 2014లో దేశంలోని దాదాపు 125 జిల్లాలు మావోయిజం, నక్సలిజంతో ఇబ్బందిపడ్డాయి. ఏటా వందలాది హింసాత్మక ఘటనలు జరిగేవి. ఈ ఘటనల్లో వేలాది మంది అమాయకులు తమ ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చింది. మృతుల్లో ఆదివాసీ సోదర సోదరీమణులే అత్యధిక సంఖ్యలో ఉండేవారు. గత ప్రభుత్వాలు మావోయిజం, నక్సలిజం బారిన పడిన గిరిజనులను గాలికి వదిలేశాయి. గిరిజనుల హక్కులను లాక్కున్నా నోటికి తాళం వేసుకుని కూర్చున్నారు. గిరిజన సమాజ సోదర సోదరీమణులను కనీసం ఓటు కూడా వేయనిచ్చేవారు కాదు. అప్పటి ప్రభుత్వాలు కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తూ కళ్లు మూసుకున్నాయి. నేడు నక్సలిజం-మావోయిజం పూర్తిగా అంతం కావడంతో గిరిజన సమాజానికి చెందిన తల్లులు, సోదరీమణులు మాకు తమ ఆశీస్సులను అందిస్తున్నారు. దేశం సాధించిన విజయాల్లో నక్సలిజం-మావోయిజం నుంచి విముక్తి పొందడం కూడా ఒకటి.

ఎల్‌నినోతో పాటు ఒకేసారి రెండు తుపాన్లతో ఏపీకి భారీ నష్టం

మొదటి పేజి తరువాయి




యుద్ధ వేగంతో సహాయక కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. రహదారులు, విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటివి 24 గంటల్లోనే పునరుద్ధరించగలిగామని అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చామని సీఎం చంద్రబాబు వివరించారు. పంట నష్టపోయిన రైతులకు బీమా సాయం త్వరగా అందేలా పని చేస్తున్నామని పేర్కొన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అదనపు రేషన్ కూడా అందించామని గుర్తు చేశారు. కోస్తాంధ్ర ప్రాంతం తరచూ తుపాన్లు ఎదుర్కొంటూనే ఉందని తెలిపారు. తుపాను నష్టాన్ని తగ్గించేలా శాశ్వత పరిష్కారంగా మౌలిక వసతులు మరింత దృఢంగా నిర్మించాలని.. దీనికి కేంద్ర సాయం కావాలని ఆ బృందాన్ని సీఎం చంద్రబాబు కోరారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని 10 రోజుల్లో తుపాను నష్టంపై కేంద్రానికి నివేదిక సమర్పించాలని ఆయా బృందాలకు విజ్ఞప్తి చేశారు. తక్షణమే తుపాను సాయాన్ని అందించాలని ఈ సందర్భంగా కేంద్రానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. మురను తుపాను నష్టంపై అంచనా వేయడానికి కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల బృందం ఏపీకి వచ్చిన సంగతి తెలిసిందే. వారు రెండు బృందాలుగా విడిపోయి.. బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో పర్యటించాయి. క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంట పొలాలు, కాలువలు, రహదారులు, ఇళ్లు పరిశీలించాయి. బాపట్ల, జమ్మలపాలెం, చీరాల, చిన్నగంజాం, పర్చూరు, నిడమర్రు, ఉంగుటూరు, చిలకలూరిపేట, గౌరిపట్నం సహా దాదాపు 60 ప్రాంతాల్లో ఈ బృందాలు పర్యటించాయి. భీమడోలు మండలం సూరప్పగూడెంలో పంట నష్టంపై నేరుగా రైతులతో ఈ బృందం సభ్యులు మాట్లాడారు. రావులపర్రులో డ్రెయినేజీ, వరి పంటలను పరిశీలించారు. కునకలమర్రులో కొమ్ము కాలవ, రహదారులు, సాగునీటి వ్యవస్థను పరిశీలించారు. చీరాలలో మత్స్యకారుల పడవలకు జరిగిన నష్టంపై ఆరా తీశారు. బొప్పూడిలో పక్కా ఇళ్లు, ఉద్యాన పంటలు, వ్యవసాయం, బాతుల పెంపకందారులకు జరిగిన నష్టం గురించి వివరాలను స్వయంగా ఆయా బృందాలు అడిగి తెలుసుకున్నాయి. యడ్లపాడు - తుర్లపాడు మధ్య జలాది మీదుగా ఉన్న ఆర్ అండ్ బీ రహదారులను పరిశీలించాయి. ఈ పర్యటనలో భాగంగా ఆయా బృందాలు పరిశీలించిన వివిధ అంశాలను ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబుకు ఈ రోజు వివరించాయి.

బంగాళాఖాతంలో తీవ్రరూపం దాల్చిన వాయుగుండం.. ఏపీకి 'అక్వాన్' గండం

మొదటి పేజి తరువాయి

అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం క్రమంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి ప్రస్తుతం ఆగ్నేయ, దానిని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర-వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. వాతావరణ శాఖ వివరాల ప్రకారం, ఈ వాయుగుండం నవంబర్ 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతాలు, పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకుని తుపానుగా మారనుంది. ఆ తర్వాత నవంబర్ 17 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడనుంది. అనంతరం మరింత తీవ్రరూపం దాల్చి, రాగల రెండు రోజుల్లో వాయవ్య దిశగా కదులుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపునకు దూసుకువచ్చే అవకాశముంది. ఇది తుపానుగా మారితే దీనిని 'అక్వాన్' అని పిలవనున్నారు. ఈ తుపాను ప్రభావంతో నవంబర్ 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర, యానాంలలోని చాలా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. నవంబర్ 18 నుంచే కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు ప్రారంభమవుతాయి. రాయలసీమలో నవంబర్ 19, 20 తేదీల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. తెలంగాణలోనూ నవంబర్ 20న పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో నవంబర్ 18, 19 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఒడిశాలో నవంబర్ 19 నుంచి 21 వరకు భారీ వర్షాలు నమోదయ్యే వీలుంది. నవంబర్ 18 నుంచి 20 వరకు కోస్తాంధ్ర, యానాం, తమిళనాడు, పుదుచ్చేరి తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా



60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం నెలకొంటుంది. నవంబర్ 20న తెలంగాణలోనూ బలమైన ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేసే అవకాశం లేదు

మొదటి పేజి తరువాయి

తన జన్మదినం సందర్భంగా పూసుకుంట గిరిజనులతో సమావేశమయ్యారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకొని అర్హులైన గిరిజనులకు పెన్షన్లు, రేషన్ కార్డులు, జాబ్ కార్డులు, పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు.

ఎల్‌నినో ప్రపంచానికి విపత్తులా మారింది..

ఎల్‌నినో ప్రపంచానికి విపత్తులా మారిందని మంత్రి తుమ్మల తెలిపారు. ఎల్‌నినో ప్రత్యేక పరిస్థితుల్లో తాగునీటికి ఎద్దడి లేకుండా నీటిని నిల్వ చేస్తున్నామని వెల్లడించారు. గతంలో మాదిరిగా గోదావరిలో నీటి ప్రవాహం లేదని చెప్పుకొచ్చారు. తాగునీటి గండం



లేకుండా నీటిని నిల్వ చేస్తున్నామని వివరించారు. సీతమ్మ సాగర్ పూర్తి అయితే 36 టీఎంసీల నీటిని నిల్వ చేయొచ్చని అన్నారు. 350 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

సీతమ్మ సాగర్ నిర్మాణం పూర్తి అవకపోవడంతో ఆనకట్ట ఎత్తు పెంచుతామని మంత్రి తుమ్మల అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరా ఇబ్బంది లేకుండా నీటిని నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. దుమ్ముగూడెం ఆనకట్టపై మీటర్ ఎత్తున ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తామని.. ఇప్పటికే మూడు లేయర్లు ఇసుక బస్తాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మరో రెండు, మూడు లేయర్లు ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తామని, ఒక టీఎంసీ మేర నీటిని నిల్వ చేయొచ్చని అన్నారు. గోదావరి నీటి నిల్వ విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు

మొదటి పేజి తరువాయి

పాల్గొన్న కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల తీరుపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలకు పదవుల తాలూకు హుందాతనం, గౌరవం తెలియకుండా పోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. గాంధీ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సైతం రాహుల్ గాంధీ నడుపుతున్న బైక్ వెనుక నౌకర్ల మాదిరిగా పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. శనివారం నాడు గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ నిర్వహించిన బైక్ ర్యాలీ దృశ్యాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కూడా కేటీఆర్ తప్పుపట్టారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గతంలో అమిత్ షా కాళ్లకు మొక్కడం, ఆయన చెప్పులు మోయడం వంటి చర్యలను గుర్తుచేస్తూ, ఇది అత్యంత సిగ్గుచేటైన, అనుచితమైన ప్రవర్తన అని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఈ రెండు జాతీయ పార్టీలు ఏనాడూ గౌరవించలేవని ఆయన స్పష్టం చేశారు. కాగా, రాహుల్ గాంధీ బైక్ వెనుక తాను పరిగెత్తడంపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టత ఇచ్చారు. తాను కూడా బైక్‌పైనే వెళుతున్న క్రమంలో వాహనం స్కిడ్ అయ్యిందని, రాహుల్ గాంధీ తనను గమనించి పక్కకు పిలిచారని తెలిపారు. తాను శారీరకంగా ఫిట్‌గా ఉన్నందునే పక్కనే పరిగెత్తుకుంటూ వెళ్లానని, రాహుల్ గాంధీ వెంట అలా పరిగెత్తడం తన అదృష్టంగా భావిస్తున్నానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు, అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ పాల్గొనడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని నీతులు చెబితే సరిపోదని, ముందుగా రాజ్యాంగ విలువలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికింది. ఏ హోదాలో, ఏ ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రారంభిస్తున్నారని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ శనివారం గిగ్ వర్కర్ల



సంక్షేమ ప్యాకేజీని ప్రకటించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'భారత్ సమ్మిట్' ముగింపు సభలో ప్రసంగించిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఈ ప్రశ్నలను సంధించింది.

సాంకేతిక ఆవిష్కరణల్లో భారత్ గ్లోబల్ లీడర్ గా ఎదగాలి: రాజ్‌నాథ్ సింగ్

మొదటి పేజి తరువాయి

మన స్వదేశీ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవాలి. అలాగే, రక్షణ రంగాల్లో దేశీయ సామర్థ్యాలను అభివృద్ధి చేయడం చాలా అవసరం."

- రాజ్ నాథ్ సింగ్ , రక్షణమంత్రి

'పరికరాలను విడదీయకుండా వాటి లోపాలను గుర్తించాలి'

శస్త్రచికిత్స అవసరం లేకుండా మానవ శరీరంలోని సమస్యలను అల్ట్రాసౌండ్, ఎక్స్‌రేలు ఎలా గుర్తిస్తాయో, పరికరాలను విడదీయకుండా వాటి అంతర్గత లోపాలను గుర్తించేందుకు చీణ సాంకేతికత ఉపయోగపడుతుందని రాజ్ నాథ్ పేర్కొన్నారు. భారత రక్షణ వ్యవస్థలను ఆధునీకరిస్తున్న తరుణంలో ప్రతి విడిభాగం నాణ్యతతో ఉండాలని నొక్కి చెప్పారు. బయటకు కనిపించని లోపాల వల్ల పరికరాల జీవితకాలం తగ్గడమే కాకుండా, కీలక సమయాల్లో ఆపరేషన్ల విజయానికి ముప్పు వాటిల్లవచ్చని హెచ్చరించారు.

'నాణ్యత అనేది జాతీయ భద్రతతో ముడిపడిన అంశం'

ఒక దేశ పురోగతి కేవలం అది అభివృద్ధి చేసే సాంకేతికతలపైనే కాకుండా, అది నిర్మించే వ్యవస్థల నాణ్యత, విశ్వసనీయత, భద్రతపై కూడా ఆధారపడి ఉంటుందని రాజ్ నాథ్ సింగ్ నొక్కి చెప్పారు. భారత రక్షణ వ్యవస్థలు మరింత అధునాతనంగా మారుతున్నందున, తయారీలో ప్రతి దశలోనూ అత్యున్నత నాణ్యత, విశ్వసనీయత ప్రమాణాలను అందుకోవాలని అన్నారు. క్షిపణులు, యుద్ధ విమానాలు, నౌకలు, అంతరిక్ష నౌకల తయారీలో నాణ్యత కేవలం నిబంధన మాత్రమే కాదని, అది జాతీయ భద్రతతో ముడిపడిన అంశమని ఆయన స్పష్టం చేశారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించడం కేవలం ఆర్థిక లక్ష్యం కాదని, అదొక వ్యూహాత్మక అవసరమని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు తయారీదారులు, స్టార్టప్‌లు, మీవీజులు ఇందులో కీలక పాత్ర పోషించాలని సూచించారు.



'భద్రతా అవసరాలకు అనుగుణంగా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలి'

వేగంగా మారుతున్న భౌగోళిక వాతావరణానికి అనుగుణంగా అడుగులు వేయాల్సిన అవసరముందని రక్షణమంత్రి సూచించారు. ఇందుకోసం స్వదేశీ ఆయుధాలు, ప్లాట్‌ఫారమ్‌లు, సహాయక వ్యవస్థలు అన్ని వేళలా అత్యున్నత స్థాయి విశ్వసనీయతను, పనితీరును అందించాలని అన్నారు. ఎన్‌డిటి రంగానికి చెందిన నిపుణులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, మారుతున్న భద్రతా అవసరాలకు అనుగుణంగా తమ సామర్థ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని, ఆవిష్కరణల స్ఫూర్తిని సజీవంగా ఉంచాలని ఆయన కోరారు.

నాన్-డిస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్ రంగం

మరోవైపు, నాన్-డిస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్ రంగంలో జరుగుతున్న సాంకేతిక మార్పులపై రాజ్ నాథ్ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్, అధునాతన సెన్సార్లు, డిజిటల్ ట్విన్స్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటివి తనిఖీ, నిర్మాణ ఆరోగ్య పర్యవేక్షణ అవకాశాలను గణనీయంగా విస్తరిస్తున్నాయని నొక్కిచెప్పారు. ఈ సాంకేతికతలు, తనిఖీల వేగాన్ని, స్థిరత్వాన్ని మెరుగుపరుస్తాయని, సంక్లిష్టమైన డేటా విశ్లేషణను సులభతరం చేస్తాయని, సంప్రదాయ పద్ధతుల ద్వారా సులభంగా గుర్తించలేని నమూనాలను గుర్తిస్తాయని చెప్పారు. తనిఖీ ప్రక్రియలను మరింత కచ్చితమైనవిగా, సమర్థవంతమైనవిగా మార్చడానికి, ఇప్పటికే ఉన్న తనిఖీ పద్ధతులను అధునాతన డిజిటల్ సాంకేతికతలతో తెలివిగా అనుసంధానించడంలోనే భవిష్యత్తు ఉందని ఉద్ఘాటించారు.

అనంత సూర్య తెలుగువార

నామినేషన్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

ముదిగుబ్బ, బత్తలపల్లిలో పర్యటించిన అడిషనల్ ఎస్పీ అంకిత సురానా





శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి అనంత సూర్య: పంచాయతీ ఎన్నికల తొలి విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల్లో నామినేషన్ కేంద్రాలను అడిషనల్ ఎస్పీ అంకిత సురానా ఐపీఎస్ ఆదివారం సందర్శించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, వాగ్వాదాలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థులు, ప్రతిపాదకులు ఎన్నికల నిబంధనలు పాటించేలా చూడాలని, కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో పోలీసు శాఖ అన్ని భద్రతా చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ పర్యటనలో డీఎస్పీలు రవిబాబు, శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నల్లమాడ సర్పంచ్ అభ్యర్థిగా టీడీ రఘునాథరెడ్డి విస్తృత ప్రచారం

ఒక్క అవకాశం కల్పించండి.. పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తా



నల్లమాడ, అనంత సూర్య: నల్లమాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న టీడీ రఘునాథరెడ్డి ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చెరువు వాండ్లపల్లి, కొత్తపల్లి, నల్లమాడ ఎస్సీ కాలనీలో పర్యటించి ఓటర్లను కలుసుకున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ తనకు ఒక అవకాశం కల్పించి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి కోసం కాకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు. సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు రహదారులు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన కుటుంబం గత ఎనిమిదేళ్లుగా సుమారు రూ. 30 లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా ప్రజలకు ఉచితంగా తాగునీరు అందిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారని తెలిపారు. ప్రచారంలో భాగంగా పలువురు ఓటర్లు ఆయనను ఆప్యాయంగా పలకరించి తమ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరణించిన జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

కష్టకాలంలో కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం.. జనసేన నాయకులు



పుట్టపర్తి అనంత సూర్య: అనారోగ్యంతో మృతిచెందిన జనసేన కార్యకర్త గొర్ల రమేష్ కుటుంబానికి పార్టీ నాయకులు రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పుట్టపర్తి నియోజకవర్గం అమడగూరు మండలం బావిచెరువుపల్లి గ్రామానికి చెందిన రమేష్ మూడు రోజుల క్రితం అనారోగ్య కారణాలతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు గ్రామానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకుల సహకారంతో సేకరించిన రూ. 50 వేల నగదును తొట్ల గంగాధర్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యకర్తల కుటుంబాలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం తమ బాధ్యతని, రమేష్ కుటుంబానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ మేకల ఈశ్వర్, మార్కెట్ యార్డు చైర్మన్ పూల శివప్రసాద్, సొసైటీ చైర్మన్ కె.నరేష్, వెంకటేష్ నాయక్, గందోడి సతీష్, కరుణాకర్, అనిల్, ఉత్తప్ప, జగదీష్, కిషోర్, దినేష్, వేణు, కొండబోయిన సతీష్, డేరంగుల ఉపేంద్ర, చక్రపాణి, రామ్మోహన్, ధనుంజయ, జయసింహ తదితరులతో పాటు అమడగూరు, ఓడిసి మండలాల జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రమేష్ మృతికి సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చేనేత సబ్సిడీ అక్రమాలపై ఎనిమిదేళ్లుగా తేలని విచారణలు!

ఎన్ హెచ్ డి సి ఆఫీసర్ బి ఎస్ . గణేశా పై చేనేత కళాకారులు దాడికి యత్నం

యాడికి, నవంబర్ 15 (అనంత సూర్య ప్రతినిధి): చేనేత కళాకారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యార్న్ సబ్సిడీ పథకంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. అసలైన చేనేత కళాకారులకు తెలియకుండానే వారి పేర్లతో సబ్సిడీ పాస్‌బుక్కులు జారీ చేసి, వారికి అందాల్సిన సబ్సిడీ ప్రయోజనాలను మధ్యవర్తులు, దళారులు స్వాధీనం చేసుకున్నారనే ఫిర్యాదులు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. 2017లో వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ బాధితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని చేనేత నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2017 అక్టోబర్ 13న చేనేత నాయకుడు మాచర్ల మోహన్ రావు ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా మదనపల్లిలోని నీరుగట్టువారిపల్లిలో చేనేత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌హెచ్‌డీసీ ప్రాంతీయ అధికారి బి.ఎస్. గణేశా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కళాకారులు తమకు తెలియకుండానే తమ పేర్లతో యార్న్ సబ్సిడీ పాస్‌బుక్కులు జారీ చేశారని, తమకు రావాల్సిన సబ్సిడీ డబ్బులను మధ్యవర్తులు స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో సంబంధిత కార్యాలయ సిబ్బంది పాత్రపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో సమావేశంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొని, కొందరు కళాకారులు ఆగ్రహంతో కుర్చీలు విసిరే స్థాయికి పరిస్థితి చేరింది. చివరకు గందరగోళం మధ్య సమావేశం ముగిసింది. ఈ ఘటన అప్పట్లో పలు వార్తాపత్రికల్లోనూ ప్రచురితమైంది.

కేంద్ర జౌళి శాఖకు ఫిర్యాదు

ఈ ఘటనపై చేనేత నాయకుడు మాచర్ల మోహన్ రావు కేంద్ర జౌళి శాఖకు ఫిర్యాదు చేశారు. చేనేత కార్మికుల పేర్లతో అక్రమంగా పాస్‌బుక్కులు జారీ చేశారనే ఆరోపణలు, సబ్సిడీ నిధుల దుర్వినియోగం, సంబంధిత అధికారుల బాధ్యతలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

ఈ క్రమంలో 2025 జూలై 15న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ నాయకుడు మాచర్ల మోహన్ రావుతో ఎన్‌హెచ్‌డీసీ కమర్షియల్ మేనేజర్ జితేంద్ర తోలంబియా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ నిర్వహించారు. అయితే విచారణ అనంతరం కూడా సమస్యకు పరిష్కారం లభించలేదని బాధితులు వాపోతున్నారు.

విచారణలో తేలాల్సిన అంశాలెన్నో

చేనేత కళాకారుల పేర్లతో జారీ అయినట్లు ఆరోపిస్తున్న సబ్సిడీ పాస్‌బుక్కులు, కార్డుల నంబర్లు, పాస్‌బుక్కుల జారీ తేదీలు, యార్న్ సరఫరా చేసినట్లు చూపిన సప్లయర్ల వివరాలు, అనుమానాస్పద లెడ్జర్ రసీదులు, నకిలీవని ఆరోపిస్తున్న ఎల్ఆర్ పత్రాలు, రవాణా బిల్లులు వంటి ఆధారాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉందని చేనేత నాయకులు పేర్కొంటున్నారు. సబ్సిడీ ఎవరి పేరుతో మంజూరైంది? ఆర్థిక ప్రయోజనం వాస్తవంగా ఎవరికి చేరింది? యార్న్‌ను ఎవరు తీసుకున్నారు? సరఫరా నిజంగా జరిగిందా? సమర్పించిన బిల్లులు అసలైనవేనా? లబ్ధిదారుల సమ్మతి లేకుండానే పాస్‌బుక్కులు జారీ చేశారా? నకిలీ పత్రాలతో సబ్సిడీ క్లెయిమ్ చేశారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. వీటన్నింటిపై స్వతంత్ర విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు కోరుతున్నారు. రాజకీయ పోరాటానికి చేనేత నాయకుల ప్రణాళిక ఎనిమిదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగకపోవడంతో చేనేత నాయకులు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఈ సమస్యను కేవలం పరిపాలనా ఫిర్యాదుగా కాకుండా దేశవ్యాప్తంగా చేనేత కళాకారుల హక్కులకు సంబంధించిన సామాజిక, రాజకీయ ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు. అవసరమైతే న్యాయపోరాటంతో పాటు ప్రజాస్వామ్య పద్ధతుల్లో వీధి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల ప్రభావానికి తావులేకుండా స్వతంత్ర విచారణ జరపాలని, బాధిత లబ్ధిదారులను నేరుగా విచారించాలని, అనుమానాస్పద పత్రాలు, ఎల్ఆర్‌లు, రవాణా బిల్లులు, సబ్సిడీ చెల్లింపులపై ఫోరెన్సిక్ సహా అవసరమైన సాంకేతిక పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన నిజమైన చేనేత కళాకారులకు వారి హక్కులను తిరిగి అందించాలని కోరుతున్నారు. లేకపోతే కేంద్ర జౌళి శాఖ, ఎన్‌హెచ్‌డీసీ ఉన్నతాధికారుల కార్యాలయాల ఎదుట దేశవ్యాప్త నిరసనలు చేపట్టడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చేనేత నాయకులు హెచ్చరిస్తున్నారు. చేనేత కళాకారుల పేర్లతోనే సబ్సిడీ ప్రయోజనాలు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలపై ఇప్పటికైనా కేంద్ర జౌళి శాఖ స్పందించి, సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని చేనేత వర్గాలు కోరుతున్నాయి.



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఫంక్షన్ హాల్ లో

వివాహ వేడుకకు హాజరైన బొంబాయి రమేష్ నాయుడు



యాడికి అనంతశూర్య ప్రతినిధి నవంబర్(15) : ఈరోజు యాడికి మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఫంక్షన్ హాల్ నందు మన్నే వారి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన పాల్గొన్నవారు చిట్టెం రెడ్డి బాల్ రెడ్డి కాసా చంద్రమోహన్ వెంకట నాయుడు

భీమునిపల్లి గ్రామానికి చెందిన ఉప్పర వెంకటరమణ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



యాడికి అనంత సూర్య ప్రతినిధి నవంబర్(15) : అనంతపురం పట్టణంలోని నిహాల్ హాస్పిటల్‌లో భీమునిపల్లి గ్రామానికి చెందిన ఉప్పర వెంకట రాముడు అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని, ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించిన తాడిపత్రి మాజీ శాసన సభ్యులు శ్రీ కేతిరెడ్డి పెద్దారెడ్డి

పులివెందులలో రాష్ట్ర ఎన్నికల సంఘం సిత్రాలు

యాడికి అనంత సూర్య ప్రతినిధి నవంబర్(15) : పులివెందుల ఎంపీపీ స్థానాన్ని ఎస్టీలకు కేటాయించిన ఎన్నికల సంఘం

కానీ మండలంలోని 5 ఎంపీటీసీ స్థానాల్లో ఏ ఒక్క చోటా ఎస్టీలకు కేటాయించని వైనం ఎంపీపీని ఎన్నుకునేందుకు ఎస్టీ ఎంపీటీసీ లేని చోద్యం ఐదు ఎంపీటీసీ స్థానాల్లో జనరల్ మహిళకు 2, జనరల్ 1, ఎస్సీ--1, బీసీ--1 కేటాయింపు వీటిలో ఎక్కడా ఎస్టీకి కేటాయించని వైనం..ఎస్టీ ఎంపీటీసీ లేకుండా ఎంపీపీని ఎలా ఎన్నుకుంటారనే ప్రశ్న దౌర్జన్యం చేసి వైఎస్సార్సీపీ నామినేషన్లు పడకుండా 5 స్థానాలనూ ఏకగ్రీవం చేసుకున్న టీడీపీ అరాచకాలు చేసి గెలిచినా ఎంపీపీ స్థానం ఎవరికీ దక్కదని తెలిసి అవాక్కయిన టీడీపీ నేతలు

ఎన్నికల సంఘం తప్పిదంతో ఏం చేయాలో పాలుపోని అధికారులు

తిరిగి రిజర్వేషన్లు కేటాయించి ఎన్నిక జరుపుతారా అనే ప్రచారం

ఏం చేయాలో పాలుపోక తర్జనభర్జనలు పడుతున్న అధికారులు, అధికార పార్టీ నేతలు

దళిత యువతకు అండగా బీఎస్పీ నాయకులు

నాగిరెడ్డి పల్లె నరేంద్ర న్యాయవాది హరిప్రసాద్

ఉరవకొండ నియోజకవర్గం, అనంతపురం జిల్లా, అనంత సూర్య : బెలుగుప్ప మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దళిత యువకులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు, పోలీస్ కేసులు తదితర అంశాలపై స్పందిస్తూ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు, నాగిరెడ్డిపల్లి నరేంద్ర మరియు న్యాయవాది పి.ఎస్. హరిప్రసాద్ బెలుగుప్ప మండలానికి వెళ్లి స్థానిక దళిత యువతను కలుసుకున్నారు. ఈ సందర్భంగా యువకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, వారి ఇబ్బందులను, వివిధ కేసులకు సంబంధించిన పరిస్థితులను అడిగి తెలుసుకుని వారితో విస్తృతంగా చర్చించారు. ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని, చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు సరైన న్యాయ సలహాలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో న్యాయపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా పోలీసు అధికారులు కూడా యువత పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని, చిన్న చిన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. యువకుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారిని సరైన మార్గంలో నడిపించేలా సహకరించాలని, అనవసరంగా కేసుల్లో చిక్కుకోకుండా అవగాహన కల్పించాలని, వారి జీవితాలు బాగుపడాలని, విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లేందుకు పోలీసు యంత్రాంగం కూడా బాధ్యతాయుతంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. యువత జీవితాలు నాశనం కాకూడదు.. వారి భవిష్యత్తు బాగుండాలి.. సమస్యల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయపరమైన సహాయం, సామాజిక అండదండలు అందాలి అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా యువతలో ధైర్యం, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం పెంపొందించేలా మాట్లాడారు. ఏ సమస్య వచ్చినా ఒంటరిగా భావించవద్దని, న్యాయం కోసం చట్టబద్ధమైన మార్గాల్లో పోరాడాలని, మంచి నడవడికతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. దళిత యువతకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, వారి హక్కుల పరిరక్షణ కోసం, న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం, వారి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని నాగిరెడ్డిపల్లి నరేంద్ర, పి.ఎస్. హరిప్రసాద్ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బెలుగుప్ప మండలంతో పాటు పలు గ్రామాలకు చెందిన దళిత యువకులు తిమ్మరాజు, మనోజ్, మల్లికార్జున, బుజ్జి పాల్గొని తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. బిఎస్పీ నాయకుల సహకారానికి అండగా ఉంటామని హామీ వలన వారికి ప్రత్యేక ధన్యవాదాలు జై భీమ్ లు తెలిపారు....



అనంత సూర్య తెలుగువార


- మూడు రోజుల్లో బుల్డోజర్‌తో పెద్దలు కూల్చేశారు
- మళ్లీ పూర్వ వైభవానికి ఎమ్మెల్యే అగచాట్లు
- ఎమ్మెల్యే మాట పెడచెవిన పెట్టడమే మేయర్ ఓటమికి కారణమా !





ముస్లిం మహిళకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ (ఫైల్)

మూడేళ్లు.. ప్రజాకోటను నిర్మించాడు



అనంతపురం, నవంబర్ 15 అనంత సూర్య :

కొన్ని పత్రికలు ఆయనపై ఎన్ని వక్రీకరణ వార్తలు రాసినా.. ఎమ్మెల్యే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అభి వృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండడంతో నగరంలో తిరుగులేని నాయకుడిగా ఎది గారు.. ఆయన పేరే దగ్గుపాటి వెంకటప్రసాద్. మూడేళ్లగా అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేస్తూ, టీడీపీ కార్య కర్తకు ఏ కష్టం వచ్చినా 'నేనున్నానంటూ' ముందుండే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు కొత్త కష్టం వచ్చి పడింది. అదేమిటంటే..!

ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ఎమ్మెల్యే కు పూర్తిస్థాయిలో స్వేచ్ఛని ఇవ్వకుండా ఎన్నికల అబ్జర్వర్లు ఏరాసు ప్రతాపరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు పూల నాగ రాజు అడ్డుపడుతూ వచ్చారు. చివరకు టికెట్ల కేటాయిం పులో కూడా ఏమాత్రం పట్టు లేని బీజేపీకి ఏకంగా ఆరు సీట్లు కేటాయించడం, అందులో ఒక్క సీటు మాత్రమే, అదీ కనీస గెలుపొందడంతోనే ఈ దూతల ఎన్నికల వ్యూహం ఏవిధంగా బెడిసికొట్టింది అనే విషయం ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ప్రతి డివిజన్లోనూ సమర్థులను గుర్తించి ఆరు నెలల ముందే ఎమ్మెల్యే ప్రసాద్ గెలుపు గుర్రాలకు టికెట్లు ఇచ్చే విధంగా వ్యూహాలు రూపొందించారు. తన సన్నిహితులకే కాకుండా సమర్థులకు టికెట్లు ఇచ్చే విధంగా ఎమ్మెల్యే భావించినట్లు సమాచారం. మొదటి నుండి దూరంగా ఉన్న మైనార్టీ వర్గాలకు సంబంధించి ఏ కార్యక్ర మం జరిగినా, వారికి సీఎం రిలీఫ్ ఫండ్‌లో సైతం అధిక ప్రాధాన్యత ఇస్తూ మైనార్టీలను టీడీపీ వైపు తిప్పుకోగలి గారు. మూడు సంవత్సరాలుగా ప్రజల పట్టుతో నిలుపు కున్న కోటను మూడు రోజుల్లో అధిష్టాన దూతలు కూల్చేసి నట్లు రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లా నాయకుడు రాయల్ మురళి 59వ డివిజన్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఏకంగా అధిష్టానంతో ఒత్తిడి తెప్పించి టికెట్ తీసుకున్నారు. 21వ డివిజన్ తీసుకోవాలని ఎమ్మెల్యే కోరినా, తనను ఓడించడానికి ఎమ్మెల్యే కుట్ర చేశాడని ఆరోపిస్తూ 59వ డివిజన్ తనకు కావాలని పట్టు పట్టారు. చేసేది లేక రాయల్ మురళి కోరిన 59వ డివిజన్ ఆయనకే కేటాయించింది. సినీ నటులు, కేంద్ర మంత్రులతో ఎన్నికల ప్రచారంలో దూసుకుపో యినా.. మూడు పదులు దాటని టీడీపీ తిరుగుబాటు అభ్యర్థి అక్కడ ఘన విజయం సాధించారు. జిల్లాకు ఏ నాయకుడు వచ్చినా, శాలువా కప్పి సన్మానం చేసే రాయల్ మురళికి ప్రజలు రాజకీయ సమాధి చేయడం గమనార్హం.

నగరంలో దాదాపు 25శాతంగా అంటే 60 వేల మైనార్టీ ఓట్లు ఉండే ఈ కార్పొరేషన్‌లో బీజేపీకి మేయర్ టికెట్ కేటాయించి అధిష్టానం మొదటి తప్పు చేసింది. అధిష్టానం మాటే వేదవాక్కుగా భావించే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.. ఎలాగైనా కూటమి అభ్యర్థిని గెలిపించి నగరంలో మరోసారి తన పట్టు నిలుపుకోవాలని ప్రయత్నించారు. ఆదిలోనే ఆ ప్రయత్నాలకు దూతలు గండి కొట్టినట్లు ప్రస్తుత ఫలితాల ద్వారా వెల్లడవుతోంది. టికెట్ల కేటాయింపులో పూర్తి స్వేచ్ఛ ఎమ్మెల్యేకు ఇచ్చి ఉంటే.. ఫలితాలు మరో విధంగా ఉండే వని నగర టీడీపీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తు న్నారు. ఏది ఏమైనప్పటికీ నగరంలో కూలిపోయిన కోటను ప్రజల మద్దతుతో తిరిగి నిర్మించుకోవాలంటే ఎమ్మెల్యేకు కత్తి మీద సాము లాంటిదని చెప్పవచ్చు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

శ్రేయోభిలాషులతో కలిసి కలియుగ దైవంని దర్శించుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం, నవంబర్ 15 అనంత సూర్య :



కార్తీకమాసం సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తిరుమ లలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. తన శ్రేయోభిలాషులతో కలి సి తిరుమల చేరుకున్న ఎమ్మెల్యే స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. కార్తీక మాసంలో శ్రీవారిని దర్శిం చుకోవడం ఎంతో సంతో షంగా, అదృష్టంగా ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. స్వామివారి దివ్య ఆశీస్సులతో అనంతపురం నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతో షాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.

పంచాయతీ ఎన్నికల విధులపై నాయకులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దిశానిర్దేశం

అనంతపురం, నవంబర్ 15 అనంత సూర్య :



అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని మూడు గ్రామ పంచాయతీలలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులకు పంచాయతీ ఎన్నికల పరిశీలకులుగా బాధ్యతలు అప్పగిస్తూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నికల ఫలితాలు వెలువడి అభ్యర్థులు విజయం సాధించే వరకు ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలు, వార్డులు, పోలింగ్ బూత్‌ల పరిధిలో సమన్వయంతో పని చేయాలని సూచించారు. తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి అంకితభావంతో, సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దిశానిర్దేశం చేశారు. ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వహించి, సమష్టి కృషితో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

వెటర్న్ జర్నలిస్టుల అధ్యక్షునిగా పట్నం మారుతి

అనంతపురం, నవంబర్ 15 అనంత సూర్య :





అనంతపురం జిల్లా వెటర్న్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడుగా పట్నం మారుతి రామ్మోహనరావును, ప్రధాన కార్యదర్శిగా భూపాలం సతీష్‌ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నా రు. దశాబ్దాలుగా వెటర్న్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీనికోసం తక్షణం కార్య చరణ ప్రణాళిక తయారు చేసుకోవాలని అనంతపురం జిల్లా వెటర్న్ జర్నలిస్టుల అసోసియేషన్ పిలుపు ఇచ్చింది. స్థానిక అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఉదయం అనంత పురం జిల్లా వెటర్న్ జర్నలిస్టుల తొలి సర్వ సభ్య సమావేశం సీనియర్ జర్నలిస్ట్ ఆజాద్ అధ్యక్షతన జరిగింది. సమావే శంలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు పలు తీర్మానాలు చేసుకోవడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై తక్షణ ఏర్పాట్లు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ సమావేశంలో జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు ఓపితో పాటు క్లినికల్ టెస్టులను సైతం ఉచితంగా లేదా 50 శాతం డిస్కౌంట్ సౌకర్యాన్ని కల్పించుకునేలా సంబంధిత అధికారులను కలిసేందుకు తీర్మానించుకున్నారు. అలాగే వెటర్న్ జర్నలిస్టుల ఆర్థిక ఇబ్బందులను అధిగమించెందుకు వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేసుకోవాలని, దీనికోసం అనంతపురం జిల్లా నూతన కమి టీ ద్వారా సొసైటీ రిజిస్ట్రేషన్ చేసుకుని దాని ద్వారా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసుకొని వెల్ఫేర్ ఫండ్ ఉపయోగించు కోవాలని తీర్మానించుకున్నారు. ఇక అనంతపురం జిల్లాలో ఉన్న వెటరన్ జర్నలిస్టులు ప్రతి మాసం ఏదైనా ఒక రోజు సమావేశం ఏర్పాటు చేసుకొని సభ్యుల మధ్య పరస్పర మంచి చెడుల కోసం చర్చించుకోవాలని తద్వారా ఒకరినొక రు సహకరించుకునేందుకు ఉపయోగపడుతుందని పలువు రు సభ్యులు సూచించారు. అలాగే గత దశాబ్దాలుగా వెటర్న్ జర్నలిస్టుల కోసం పెన్షన్ సౌకర్యం, ఆరోగ్య భీమా, ఇంటి స్థల నివేసన పట్టాల కోసం పోరాడుతుంటే ప్రభుత్వం కరివేపాకులా జర్నలిస్టులను ఉపయోగించుకుంటోందని, దీన్ని ఎలాగైనా కట్టడి చేసి సమస్యల పరిష్కారం కోసం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు అందోళన కార్యక్రమాలను నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తీర్మానించుకున్నారు. ఈ సర్వసభ సమావేశానికి జిల్లాలోని వెటర్న్ జర్నలిస్టులు అందరూ హాజరై విజయవంతం చేశారు.

నూతన కమిటీ ఎంపిక..

అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఉదయం జరిగిన అనంతపురం జిల్లా వెటర్న్ జర్నలిస్టుల అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో అనంతపురం జిల్లాకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీల కుడిగా శ్రీ సత్యసాయి జిల్లా వెటర్న్ జర్నలిస్టుల అసోసియే షన్ అధ్య క్షుడు లక్ష్మీనారాయణ నిర్వహణలో అనంతపురం జిల్లా వెటరన్ జర్నలిస్టుల అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా పి.మారు తి, ప్రధాన కార్యదర్శిగా భూపాలం సతీష్ బాబు, ట్రెజర ర్‌గా బాబాసాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. ఏకగ్రీవంగా ఎన్నుకోవ డానికి సహకరించిన వెటరన్ జర్నలిస్టులందరికీ పేరుపేరు నా కృతజ్ఞతలు తెలియజేస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారా నికి తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

మంగళగిరి లైబ్రరీ ఆధునిక ఆదర్శసంస్థ

సీఈఓ చంద్రశేఖర్



మంగళగిరి, నవంబర్ 15 అనంత సూర్య :

ఆధునిక సాంకేతిక వసతులతో మంగళగిరి శాఖా గ్రంథాలయం మోడ్రన్ ఇన్స్టిట్యూట్ లాగా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడిసినల్, ఆరోమాటిక్ ప్లాంట్స్ బోర్డు ముఖ్యకార్యనిర్వాహణాధికారి (సిఈఓ) ఆవుల చంద్రశేఖర్ అన్నారు. మంగళగిరి శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నా యి. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం పుస్తక ప్రదర్శన, పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వ హించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వివిధ పుస్తకాలను ప్రదర్శించి, వాటి ప్రాముఖ్యత, విశిష్టతలను వివరించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు, సమాజంలో పఠనాసక్తిని అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్యకార్యనిర్వహణాధికారి (సీఈఓ) ఆవుల చంద్రశేఖర్ విచ్చేశారు. ఆరోగ్యశాఖ నోడల్ అధికారి డా.నరేంద్ర కుమార్, జాగర్లమూడి శ్రీనివాస రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి శాఖా గ్రంథాలయ అధికారి మల్లంపాటి సీతారామయ్య అధ్యక్షత వహించారు. గ్రంథాలయ సిబ్బంది ఎన్. ఆరోగ్యం, కృష్ణ, సుబ్బారావు, అబ్దుల్ అహ్మద్ కార్యక్రమ నిర్వహణలో చురుకుగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ ప్లాంట్స్ బోర్డు సిఇఒ చంద్రశేఖర్ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం సిఈవో ఆవుల తనదైన శైలిలో మాట్లాడి ఆకట్టుకున్నారు. ఏపీ విద్య, ఐటి శాఖల మంత్రి లోకేశ్ నిర్మించిన మోడల్ లైబ్రరీ మోడరన్ టెక్నాలజీతో ఉందని కొనియాడారు. ఇక్కడ లోకేష్ చేపట్టే కార్యక్రమాలు విద్యార్థుల్లోని గొప్ప లక్షణాలను మెరుగుపరిచే విధంగా వున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ 2025 నవంబర్ 27 వ తేదీ మంగళగిరిలో మోడల్ పబ్లిక్ లైబ్రరీని ప్రారంభించారని గుర్తుచేశారు. ఈ లైబ్రరీని రూ. 1.72 కోట్లతో ఆధునీకరించారని వివరించారు. 1986లో అప్పటి మంత్రి ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం పేరుతో నాటి ముఖ్యమంత్రి హోదాలో ఎన్టీఆర్ మంగళగిరిలో లైబ్రరీకి శంకుస్థాపన చేశారని వివరించారు. ఆనాటి శిలాఫలకాన్ని, వారిద్దరి విగ్రహాలను కూడా మంత్రి నారా లోకేష్ గత ఏడాది ఆవిష్కరించడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, స్థానిక ప్రజలు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు రూ.23,500 సహాయం

అనంతపురం, నవంబర్ 15 అనంత సూర్య :



నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఓ కుటుంబానికి ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో 23,500 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ సభ్యులు వెంకటరమణ మిత్రుడు రిదేశ్ సహాయమందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల మురళి మాట్లాడుతూ.. నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అనంతపురం జిల్లాలోనే కాకుండా అవసరం ఆపద అని తెలిసిన బాధితులకు ఏ ప్రాంతం లో ఉన్నా.. సహాయం అందించడానికి ట్రస్ట్ సభ్యులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఒంగోలు నగరంలోని జడ్పీ కాలనీలో నివాసం ఉంటున్న సుమంత్, అరుణకుమారి దంపతులు వీరికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. సుమంత్ ఓ గ్రానైట్ షాప్‌లో మేనేజర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవారన్నారు. సుమంత్‌కు పార్కి న్సన్ అనే అరుదైన వ్యాధి సోకడంతో మంచానికే పరిమిత మయ్యాడన్నారు. కాళ్లు చేతులు వణుకుతూ, వ్యక్తి సహాయం లేనిదే లేవలేని స్థితిలోకి చేరుకున్నాడన్నారు. వైద్యులను సంప్రదించగా అతనికి ఆపరేషన్ చేయాలని దాదాపు 40 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపినట్లు చెప్పా రు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ఆ కుటుంబానికి నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ కొంత అండగా నిలిచింది. మొదట ట్రస్ట్ సభ్యుల సహకారంతో రూ.80 వేల వరకు ఆర్థిక సహాయం వారి ఖాతాలోకి జమ చేశారు. వైద్య ఖర్చులకు గాను మరొకసారి ట్రస్ట్ సభ్యులు వెంకటరమణ మిత్రుడు రిదేశ్ సహకారంతో 23,500 రూపాయలు వారి ఖాతాలోకి జమ చేసినట్లు నిర్మలమురళి తెలిపారు. అవసరంలోనూ ఆపదలోన ఉన్న పేదలకు వీలున్న ప్రతి ఒక్కరు సహాయం చేయాలని ఆమె కోరారు. సుమంత్ కుటుంబానికి సాయం చేయటానికి ముందుకు వచ్చిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



రోలర్ స్కేటింగ్ పోటీల్లో.. గీతిక ప్రతిభ

రజత పతకం కైవసం

అనంతపురం, నవంబర్ 15 అనంత సూర్య :



కాకినాడ వేదికగా ఇటీవల జరిగిన 38వ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ - 2026 పోటీల్లో లక్ష్మీ సినర్జీ స్కూల్ విద్యార్థిని గీతి క అద్భుత ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ ప్రతిష్టా త్మక టోర్నమెంట్‌లో, గీతిక రింక్-2 విభాగంలో పోటీపడి తన మెరుపు వేగంతో, నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకుని ద్వితీయ స్థానంలో నిలిచింది. జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా కారులు తలపడిన ఈ పోటీల్లో రజత పతకం సాధించి పాఠశాలకు, జిల్లాకు గర్వకారణంగా నిలిచిన జి.గీతికను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకం గా అభినందించారు. గీతిక ఈ విజయం సాధించడంలో విశేష కృషి చేసి, మెలకువలు నేర్పిన కోచ్‌లు నాగేంద్ర, అఖిల్ అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405